సాక్షి వికారాబాద్

బుధవారం, 3, జనవరి, 2024



దళారులను నమ్మకండి

సంక్షేమ పథకాలు ఇప్పిస్తామని మోసం చేసే దళారులను ప్రజలు నమ్మరాదని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సూచించారు. 8లో▸



అధిక దిగుబడి సాధించాలి

రైతులు వరి సాగులో అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. 8లో▸



'తెల్ల'బోయిన రైతన్న

రెండు రోజులు ప్రభుత్వ సెలవులు. సీసీఐ విజ్ఞప్తి మేరకు మరో రెండు రోజులు కొనుగోలుకు విరామం ఇచ్చారు. 9లో▸

న్యూస్‌రీల్

పెట్రోల్ బంకుల బంద్ అవాస్తవం

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: పెట్రోల్ బంకులు బంద్ అంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని, యథావిధిగా పనిచేస్తాయని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణతో సహా పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంక్ యాజమానులు సమ్మెకు దిగుతున్నారని, ఇంధన కొరత కారణంగా మూడు రోజుల పాటు పెట్రోల్ బంకులు బంద్ అవుతాయన్న వార్తల్లో వాస్తవం లేదని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

కేటీఆర్‌ను కలిసిన రోహిత్‌రెడ్డి



కేటీఆర్‌కు బొకే అందజేస్తున్న రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మంగళవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కందులకు భారీ డిమాండ్

- క్వింటాలుకు నగటు ధర రూ.8,505
- గరిష్ట ధర రూ.8,989



తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో కంది పంటకు డిమాండ్ పెరిగింది. మంగళవారం యార్డులో జరిగిన బిడ్డింగ్‌లో 2,664 క్వింటాళ్ల కందులకు విక్రయాలు జరిగాయి. క్వింటాలు కందులకు కనిష్ట ధర రూ.7,415 కాగా, గరిష్ట ధర రూ.8,989, సగటు ధర రూ.8,505 చొప్పున పలికాయి. గత నెల 4నుంచి తాండూరు మార్కెట్‌కు కంది దిగుబడులు వచ్చాయి. 9,400 క్వింటాళ్ల కందుల కొనుగోళ్లు జరిగాయని అధికారులు తెలిపారు. మరోవైపు 268 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేశారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

గోర్ బంజారా జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్ రాథోడ్



బొంరాస్‌పేట: బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15ను ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని గోర్ బంజారా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌రాథోడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50లక్షల జనాభా ఉన్న బంజారాలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించడం లేదన్నారు.

పోలీస్ విభాగాల్లో ఎస్పీ తనిఖీలు



అనంతగిరి: వికారాబాద్‌లోని తన కార్యాలయ ఆవరణలో గల పలు విభాగాలను ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు క్వార్టర్స్, వాటర్ ప్లాంట్, గ్యాస్ ఆఫీస్, స్టోర్ రూం, గెస్ట్ హౌస్, ఏఆర్ హెడ్ క్వార్టర్స్, డీపీఓ విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పలు విభాగాల్లో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఆర్ఐ సూరప్ప నాయుడు, అంజత్‌పాషా, ఆర్ఎస్ఐ తదితరులు ఉన్నారు.



పెట్రో గాబరా..

'హిట్ అండ్ రన్' చట్టాన్ని నిరసిస్తూ పెట్రోల్ ట్యాంకర్ నిర్వాహకులు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో వాహనచోదకులు పెట్రోల్ బంకులకు క్యూ కట్టారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లాలోని పెట్రోల్ బంకులు వాహనాలతో నిండిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

– తాండూరు/పెద్దేముల్



దరఖాస్తుల జాతర

రెండు రోజుల విరామం తరువాత మంగళవారం ప్రజాపాలన కార్యక్రమం పునఃప్రారంభం కావడంతో దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. తాండూరు మండలం కరన్‌కోట్‌లో ఏర్పాటు చేసిన సభ జన జాతరను తలపించింది. అర్జీలు ఇచ్చేందుకు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది.

– తాండూరు

ఛిద్రం.. జరభద్రం

దోమ మండలంలో కంకర తేలి అధ్వానంగా మారిన దోర్నాల్‌పల్లి రోడ్డు



జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లు

- రెండేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- 198 కిలోమీటర్ల మేర బాగు చేసేందుకు రూ.89 కోట్లతో ప్రతిపాదనలు
- రూ.59 కోట్లు మంజూరు
- టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- వాహనదారులకు తప్పని అవస్థలు
- కొత్త ప్రభుత్వంపై ఆశలు

వికారాబాద్: జిల్లాలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. రోడ్ల మరమ్మతులకు ఆయా శాఖలు కొంత మేర నిధులు మంజూరు చేశాయి. అధికారులు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఏళ్ల తరబడి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండేళ్ల నుంచి వరుస వర్షాలకు జిల్లా వ్యాప్తంగా అనేక రహదారులు పాడయ్యాయి.ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖలు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలు సేకరిస్తున్నారే తప్ప తాత్కాలిక మరమ్మతులు కూడా చేయడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతేడాది ఇదే సీజన్‌లో పాడైన రోడ్లకు నేటికీ మరమ్మతులు చేపట్టలేదు. ఒక్కో పని కోసం మూడు నుంచి ఐదు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ల నుంచి స్పందన రాలేదు. ఇటీవల కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో రోడ్లు బాగుపడతాయని ప్రజలు భావిస్తున్నారు.

మరమ్మతులకు దిక్కులేదు

జిల్లాలో గతేడాది కురిసిన వర్షాలకు పాడైన ఆర్అండ్‌బీ రోడ్లకు సంబంధించి ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. జిల్లా వ్యాప్తంగా 198 కిలో మీటర్ల మేర రోడ్లు పాడైనట్లు అధికారులు గుర్తించారు. వీటిని పూర్తి స్థాయిలో బాగు చేయాలంటే రూ.89 కోట్లు అవసరమని, ఆ మేరకు ప్రతిపాదనలు పంపారు. ముందుగా రూ.8 కోట్లు మంజూరు చేస్తే తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేస్తామని ప్రతిపాదనలు పంపారు. అయితే ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో దెబ్బతిన్న 98 కిలో మీటర్ల రోడ్ల మరమ్మతులకు ఆ శాఖ రూ.39 కోట్లు మంజూరు చేసింది. ఇక పంచాయతీ రాజ్ శాఖకు రూ.20 కోట్లు విడుదల చేసింది. నిధులు మంజూరైనా పనులు టెండర్ల ప్రక్రియలోనే ఆగిపోయాయి.

దెబ్బతిన్న రోడ్లు

జిల్లాలో మెజారిటీ రోడ్లు అధ్వానంగా మారాయి. వికారాబాద్ – పరిగి, వికారాబాద్ – నవాబుపేట, వికారాబాద్ – సిద్దులూర్, వికారాబాద్ – బుగ్గదేవాలయం రోడ్లు, వికారాబాద్ – తాండూరు రహదారి, కొడంగల్ – తాండూరు, కొడంగల్ – మహబూబ్‌నగర్, పరిగి– మిట్టకోడూర్, దోమ మండలంలోని దోర్నాల్‌పల్లి– గొడుగోనిపల్లి, ఐనాపూర్ – పాలెపల్లి, గడిసింగాపూర్–మల్లెపల్లి,పరిగి–షాద్‌నగర్, వికారాబాద్–సదాశివాపేట్, కోటాలగూడ–లాల్‌సింగ్ తండా,మన్నెగూడ–మిర్జాపూర్ మీదుగా లాల్‌సింగ్ తండా తదితర రోడ్లన్నీ పాడయ్యాయి. ఈ రోడ్ల మరమ్మతుల కోసం అధికారులు టెండర్లు పిలిచారు. అయితే గతంలో చేసిన పనులకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మరి కొన్ని చోట్ల పనులు జరుగుతుండడంతో కొత్త పనులు తీసుకునేందుకు సుముఖత చూపడం లేదు. కొత్తగా కొలు వుదీరిన ప్రభుత్వమైనా రోడ్ల మరమ్మతులకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయాలని జిల్లా ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు. అలాగే మంజూరైన నిధులతో రోడ్లను బాగు చేయాలని కోరారు.



మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న, శ్రీదేవి, (చిత్రంలో) కలెక్టర్ నారాయణరెడ్డి

అర్హులు దరఖాస్తు చేయండి

- వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి శ్రీదేవి

కొడంగల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి శ్రీదేవి, కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని పరిశీలించడానికి మంగళవారం వారు కొడంగల్‌కు వచ్చారు. పట్టణంలోని ఆరో వార్డు శాంతినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం పథకాలకు రూపకల్పన చేశారని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాల్లో అవసరమైన వాటిని గుర్తించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలకు పథకాల పట్ల అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకునే వారు 18 ఏళ్ల నుంచి 57 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎలాంటి పింఛన్లు పొందని వారు మాత్రమే అర్హులన్నారు. ఆధార్ కార్డును పరిగనలోకి తీసుకొని దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. రేషన్ కార్డులేని వారు కూడా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సొంత ఇల్లు లేని వారు గృహలక్ష్మి కింద దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజాపాలన శిబిరం దగ్గర ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఏ యే మందులు అందుబాటులో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అంతకు వారు పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, డిప్యూటీ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, డీఆర్‌డీఓ కృష్ణన్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కొడంగల్ రూరల్: ధూప దీప నైవేద్య అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి శ్రీదేవికి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఆమె పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెను కలసి పెండింగ్ వేతనాల తోపాటు ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హెల్త్ కార్డులు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు, అర్చక వెల్ఫేర్ ఫండ్ వర్తింపజేయాలని కోరారు. పేద అర్చకులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించాలన్నారు. పెద్ద దేవాలయాల్లో తమకు ఉచిత దర్శనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధ్యతగా పని చేయాలి

- డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ స్టీవెన్ నీల్
- ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు

దోమ: ఉపాధి హామీ పథకం అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ స్టీవెన్ నీల్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని రైతు వేదికలో 2022 – 23 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలకు డబ్బులు చెల్లింపుపై ఆరా తీశారు. కొంత మంది కూలీలకు బిల్లులు రాలేదని ఆడిట్ సిబ్బంది అధికారులకు వివరించారు. వెంటనే బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. చనిపోయిన కూలీల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడ్డాయని ఆడిట్ సిబ్బంది అధికారుల దృష్టికి తెచ్చారు. మృతి చెందిన కూలీల జాబ్ కార్డులను తొలగించి, వారి ఖాతాల్లో జమ అయిన డబ్బులను రికవరీ చేయాలని సూచించారు. కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లను సక్రమంగా రాయడం లేదని, కూలీల సంతకాలు సైతం తీసుకోవడం లేదని, మోత్కుర్ గ్రామంలో ఓ రైతు మామిడి తోట కోసం గుంతలు కొట్టినా ఇప్పటి వరకు బిల్లులు రాలేదని వైస్ ఎంపీపీ మల్లేశం అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రతి అధికారీ బాధ్యతగా పని చేస్తేనే కూలీలకు న్యాయం జరుగుతుందని డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ స్టీవెన్ నీల్ అన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, వైస్ ఎంపీపీ మల్లేశం, ఎంపీడీఓ జయరాం, ఏపీఓ దస్తయ్య, ఈసీ చంద్రశేఖర్, ఎంపీటీసీ రాములు, సర్పంచ్ సురేశ్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది, ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులపై ఆరా తీస్తున్న స్టీవెన్ నీల్



దరఖాస్తు దారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చన్గోముల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 10లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేశారని పేర్కొన్నారు. గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను త్వరలో అమలు చేస్తామని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో అంతర్జాతీయ స్థాయిలో పాఠశాల ఏర్పాటు తోపాటు విద్యా భరోసా ద్వారా రూ. 5లక్షల గ్యారంటీ కార్డు ఇస్తామని తెలిపారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలోని 42వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భగవాన్‌దాస్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఆనందం, శ్రీనివాస్‌రెడ్డి, మాజీద్ ఖాన్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.3 వేల కోట్లతో అభివృద్ధి



ప్రజాపాలనలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీలు
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్ అర్బన్: వచ్చే ఐదేళ్లలో రూ.3 వేల కోట్లతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు అన్నలా వెన్నంటి ఉండి జిల్లాను అభివృద్ధి పరుస్తానని తెలిపారు. ప్రాణహిత – చేవెళ్ల, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు గత పాలకులు అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తామని ప్రకటించారు. జిల్లాలో రోడ్ల అభివృద్ధికి రూ. 300 కోట్లు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. పదేళ్లుగా ఒక్కరికి కూడా రేషన్ కార్డులు రాలేదని, త్వరలో అర్హులందరికీ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై అప్పుల భారం మోపిందని, వీటన్నిటిని అధిగమించి ప్రతి ఇంటికీ ఆరు గ్యారంటీలను అందజేస్తామన్నారు. రూ. 2లక్షల రుణమాఫీని కూడా అమలు చేస్తామన్నారు. పథకాల అమలులో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు రాజీవ్ గృహకల్పలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఒకే దరఖాస్తులో ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తెల్ల కాగితంపై రాసిచ్చినా రేషన్‌కార్డు మంజూరయ్యేలా చూస్తామన్నారు. రాజీవ్ గృహకల్పలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతగిరిలో ఏకో టూరిజం ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం, కౌన్సిలర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న శాసనసభాపతి ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సరం డైరీని మంగళవారం రాష్ట్ర శాసన సభాపతి జి.ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్, ఎస్టీయూ టీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ఎండీ షఫీ, అసోసియేటెడ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్ పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకాచారి, ఆశప్ప, చంద్రకాంత్, తిరుమలేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పరిగి: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పరిగి షాద్‌నగర్ రోడ్డు మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని, నిత్యం ప్రజలు నగరానికి వెళ్లాలంటే ఈ దారి నుంచే ప్రయాణించాల్సి ఉంటుంది. పనులు పూర్తి అయ్యే వరకు సంబంధిత అధికారులు పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరిగిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. తూతూమంత్రంగా పనులను నిర్వహించి చేతులు దులుపుకుంటామంటే కుదరదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్: మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా గుడి పవన్‌కుమార్‌రెడ్డి రానున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఏపీ రంగాపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన్ని మల్టీజోన్–2కు సరెండర్ చేశారు. ఆ స్థానంలో మియాపూర్ డివిజన్ సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పవన్‌కుమార్‌రెడ్డిని ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు.

మాటేసి వేటేస్తారు!



కళాశాలలో అవగాహన కల్పిస్తున్న షీ టీం బృందం

- అమ్మాయిలను వేధిస్తే అంతే
- నిమిషాల్లో వాలిపోతున్న షీ టీం బృందాలు
- అవగాహన కల్పిస్తూ అకతాయిలను మార్చే ప్రయత్నం

వికారాబాద్ అర్బన్: ఒంటరిగా రోడ్డుపై నడిచి వెళ్తుంటే వెకిలిచేష్టలతో వేధించే పోకిరీలు.. ప్రయాణ ప్రాంగణాల్లో నిల్చొనే విద్యార్థినులను అసభ్యకరంగా సైగలు చేసే అకతాయిలు.. రెచ్చిపోయే మృగాళ్లు... వీరికి అడ్డుకట్ట పడేదెలా...? ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా తిరగలేమా అంటూ బాధపడే మహిళలు, విద్యార్థినులకు షీ టీం వెన్నంటి ఉంటుంది. షీ బృందాల ఏర్పాటు తరువాత ఇలాంటి భయాందోళనలు దూరమయ్యాయి. ఒక్క ఫోన్ కాల్ లేదా.... వాట్సాప్ మేసేజ్ పంపిస్తే చాలు వెంటనే స్పందిస్తూ షీ టీం బృందాలు క్షణాల్లో వాలిపోయి బాధితులకు భరోసా కల్పిస్తున్నారు.

2014లో ప్రారంభం..

బాలికలు, స్త్రీల రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న షీ టీం సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 2014 నుంచి షీ టీం బృందం పనులు ప్రారంభించింది. అప్పటి నుంచి జిల్లాలోని ప్రధాన పట్టణాలైన పరిగి, వికారాబాద్, తాండూర్, కొడంగల్‌లతో పాటు ఆయా మండల కేంద్రాల్లోని కళాశాలలు, పాఠశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా షీ టీం బృందం మఫ్టీలో ప్రధాన వీధుల్లో, బస్టాండ్‌ల్లో, రైల్వేస్టేషన్‌ల్లో, సినిమా థియేటర్‌ల వద్ద, కళాశాలలు, పాఠశాలల వద్ద, పబ్లిక్ స్థలాల వద్ద నిఘా పెట్టి పోకిరీల పనిబడుతున్నారు. తరగతి గదుల్లో, ఆఫీసు కార్యాలయాల్లో పనిచేసే విద్యార్థినులు, మహిళల రక్షణకు కూడా షీ టీం బృందాలు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు.

విద్యార్థులకు అవగాహన

అమ్మాయిలను వేధిస్తే ఎలాంటి శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందో షీ టీం బృందాలు ఆయా కళాశాలల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అబ్బాయిలకు అవగాహన కల్పిస్తున్నారు. శిక్ష పడితే దాని పరిణామాలు ఎలా ఉంటేయనే విషయాన్ని విద్యార్థులకు వివరిస్తున్నారు. ఇదే సమయంలో విద్యార్థుల ప్రవర్తన, నడవడిక, మన లక్ష్యం, తల్లిదండ్రుల ఆశలను గుర్తు చేస్తూ వారిని సన్మార్గంలో నడిపించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. వేధింపులకు గురయ్యే అమ్మాయి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు. వేధిస్తున్నట్లు షీ టీం బృందానికి అనుమానం వస్తే అతనిపై కేసు నమోదు చేసే అవకాశం ఉందని, ఒక వేళ బాధిత బాలిక, లేదా స్త్రీ ఫిర్యాదు చేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని షీ టీం సభ్యులు తెలియజేస్తున్నారు.

ముందుగా వార్నింగ్.. వినకుంటే కేసు

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే అక్కడున్న సందర్భాన్ని బట్టి ముందుగా రెండు సార్లు వార్నింగ్ ఇస్తారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. అప్పటికీ వినకుంటే పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తారు. ముందుగా డీఎస్పీ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ చేపడుతారు.

ఇలా చేస్తే శిక్షార్హులు..

ఒక అమ్మాయి లేదా స్త్రీ మనోభావాలు , మర్యాదకి భంగం కల్గించిన , మాటలతో గాని, చూపులతో గాని, చేష్టలతో గాని ఆమెను బాధపెట్టిన చట్ట పరంగా శిక్షార్హులు..

- స్త్రీ పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు సెక్షన్ (2), (4) ప్రకారం శిక్షార్హులు.
- కళాశాల యాజమాన్యం ఈవ్‌టీజింగ్ విషయంలో పనిష్మెంట్ ఇవ్వకుంటే సెక్షన్(4) ప్రకారం . కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసే అవకాశం.
- మొబైల్ ఫోన్‌ల్లో, ఆన్‌లైన్ ద్వారా ఈవ్‌టీజింగ్ చేయడం నేరం. ఇలాంటి వేధింపుల్లో సెక్షన్ 354, 354(బి) ప్రకారం కేసు నమోదు చేస్తారు.
- బాలిక, మహిళపై బలత్కారం చేసినట్‌లైతే 376, నిర్భయ చట్టం, ఫోక్సో యాక్టుల్లో శిక్షార్హులు.

నమోదైన కేసులు, అవగాహన కార్యక్రమాలు

కౌన్సిలింగ్ పొందిన వారి సంఖ్య	– 13
జిల్లాలో అవగాహన కార్యక్రమాలు	– 315
షీ టీం చేసిన కేసులు (ఎఫ్ఐఆర్)	–16
పిట్టి కేసులు	– 47
బాధితుల నుంచి ఫిర్యాదులు	– 34
రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న వారి సంఖ్య	– 46

ఎస్పీ వికారాబాద్ జిల్లా



అమ్మాయిలను వేధిస్తూ షీ టీం సిబ్బంది కంట పడితే తప్పకుండా చర్యలు తీసుకుంటారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు వెళ్లాలి. అమ్మనాన్నల నమ్మకాన్ని నిలబెట్టాలి. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ తగిన సూచనలు, సలహాలు ఇస్తుండాలి. ఇలాంటి కేసుల్లో ఇరుకుంటే భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు ఎదురోవాల్సి వస్తుంది.

– కోటిరెడ్డి, ఎస్పీ వికారాబాద్ జిల్లా

రైస్‌మిల్లు సీజ్

తాండూరు రూరల్: మండలంలోని అంతారం గ్రామంలో పంచాయతీ అనుమతి లేకుండా కొనసాగుతున్న రైస్‌మిల్లును సీజ్ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్ పేర్కొన్నారు. అంతారం శివారులోని కోట్‌పల్లి రోడ్డు మార్గంలో ఉన్న రైస్‌మిల్లుకు ఎలాంటి అనుమతి లేదన్నారు. గతంలో నోటీసులు ఇచ్చిన యజమాని స్పందించ లేదు. దీంతో మంగళవారం రైస్‌మిల్లు సీజ్ చేసినట్లు తెలిపారు.

వరిధాన్యాన్ని ఎఫ్‌సీఐకి తరలించాలి

వికారాబాద్ అర్బన్: సేకరించిన వరిధాన్యాన్ని మిల్లింగ్ చేసి వెంటనే ఎఫ్‌సీఐకి తరలించాలని మిల్లర్లను జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కష్టం మిల్లింగ్ రైస్‌పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైస్ మిల్లర్ వద్ద ఉన్న మిగులు బియ్యాన్ని వెంటనే ఎఫ్‌సీఐకి తరలించాలని చేయాలని సూచించారు. రైస్ మిల్లర్లు వారి వారి కెపాసిటీ ప్రకారం ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సీఎంఆర్‌కు పెట్టాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, మిల్లర్లు పాల్గొన్నారు.



మిల్లర్లతో మాట్లాడుతున్న లింగ్యానాయక్

కల్యాణలక్ష్మిని మెరుగుపరుస్తాం

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు ఎంతో ఉపయోగపడే పథకమని ఈ పథకాన్ని మరింతగా మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకాన్ని తమ ప్రభుత్వం కొనసాగించడంతో పాటు మరింత ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అందాయంటే అది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, తహసీల్దార్ ప్రభులు, గిర్దవరి వెంకటగిరి, సీనియర్ అసిస్టెంట్ లింగయ్య, నాయకులు అశోక్‌కుమార్, వెంకటయ్యగౌడ్, ఉమాపతిరెడ్డి, వీరసింహారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం అందించడమే లక్ష్యం

కుల్కచర్ల: ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలంలోని ఈర్లవాగుతండా, విఠలాపూర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల పాలనకు మొదటి ప్రధాన్యం ఇస్తామన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందినప్పుడే నిరుపేద కుటుంబాల ఆర్థిక పరిస్థితిలో మెరురుపడుతోందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, విఠలాపూర్ సర్పంచ్ సువర్ణమల్లేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు నరసింహనాయక్, ఉమాపతిరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.



కుల్కచర్ల: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

షాదీముబారక్, కల్యాణలక్ష్మి డీడీలను అందజేత

ధారూరు: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో ధారూరు మండలానికి చెందిన 31 మందికి షాదీముబారక్, కల్యాణలక్ష్మి డీడీలను అందజేశారు. మండల పరిధిలోని అల్లిపూర్, బాచారం, చింతకుంట, దోర్నాల్, ధారూరు, గడ్డమీది గంగారం, గురుదోట్ల, హరిదాస్‌పల్లి, కొండాపూర్‌కలాన్, కేరెళ్లి, మైలారం, నాగసమందర్, అవుసుపల్లి, రుద్రారం, రాంపూర్ తండా, మున్నూరు సోమారం గ్రామాల లబ్ధిదారులు డీడీలను అంజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, తహసీల్దార్ భవనేశ్వర్, డీటీ విజయ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్, రవీందర్‌లు, సర్పంచ్ పాండునాయక్ పాల్గొన్నారు.



ధారూరు: డీడీలు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

దళారులను నమ్మకండి

నేరుగా నాకు ఫోన్ చేయండి

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: సంక్షేమ పథకాలు ఇప్పిస్తానని మోసం చేసే దళారులను ప్రజలు నమ్మొద్దని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందొద్దని గడువు ముగిసినా ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజే స్తామని అన్నారు. కరన్‌కోట్ గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ చక్రపాణి, తహసీల్దార్ తారాసింగ్ , పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, జెడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, సర్పంచు వీణాహేమంత్, ఎంపీటీసీలు వసంత్, రాజ్‌కుమార్, శివకుమార్, మాజీ ఎంపీపీ శరణు బసప్ప, శ్రీను, సుధాకర్‌లు ఉన్నారు.

నాకు ఫోన్ చేయండి: ఎమ్మెల్యే

ఎవరైనా నాపేరు చెప్పి సంక్షేమ పథకాల్లో అవినీతికి పాల్పడితే వెంటనే తనకు ఫోన్ చేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. తనపై నమ్మకంతో గెలిపించిన తాండూరు ప్రజలకు రుణపడి ఉండి.. వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తాండూరు టౌన్ : ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల అమలుపై స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. మిగతా నాలుగు గ్యారంటీ పథకాల అమలు కోసం ప్రజాపాలన కార్యక్రమం 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో లబ్ధిదారులు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని, అర్హులను గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ వినయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, హబీబ్‌లాలా, ముక్తార్‌నాజ్, బాల్‌రెడ్డి, నర్సింహులు, ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.



తాండూరు రూరల్: మట్లాడుతున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహన్‌రెడ్డి

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

తహసీల్దార్ పురుషోత్తం

దోమ : గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, చెరువుల శిఖం భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పురుషోత్తం హెచ్చరించారు. మంగళవారం మండలంలోని దిర్సంపల్లి గ్రామంలోని చెరువు శిఖం భూమిని గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు అక్రమించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు ఆర్ఐ సుదర్శన్, సర్వేయర్, ఇరిగేషన్ అధికారులతో పాటు ఎస్ఐ రవిగౌడ్‌తో ఘటన స్థలానికి వెళ్లి చెరువు శిఖం భూమిని సర్వే చేశారు. సర్వేలో చెరువుకు సంబంధించిన శిఖం భూమి ఆక్రమణకు గురైనట్లు తెల్పి భూమిని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటయ్య, మండల అధ్యక్షుడు సత్యయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



చెరువు శిఖం భూమిని సర్వే చేయిస్తున్న తహసీల్దార్

సెలవుదినంగా ప్రకటించాలి

అనంతగిరి: రాష్ట్రంలోని గోర్ బంజారా ప్రజల ఆశాకిరణం క్రాంతికారి, ఆధ్యాత్మిక గురువు, సంఘ సంస్కర్త శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15ను సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని గోర్‌సేన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాందాస్ కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా పరిశీలించి సెలవుదినంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చింతల్‌చెరువుపై వంతెన నిర్మించండి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మత్స్యకార్మిక సంఘం నేతల వినతి
- ఎన్‌హెచ్–65 అధికారులకు మంత్రి ఆదేశాలు

అబ్దుల్లాపూర్‌మెట్: చింతల్‌చెరువు కాల్వపై శాశ్వత వంతెన నిర్మించేలా ఎన్‌హెచ్– 65 అధికారులను ఆదేశించాలని అబ్దుల్లాపూర్‌మెట్ మత్స్య కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక బీజేపీ నేతలతో కలిసి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో జరిగిన రోడ్డు విస్తరణలో అప్పటి కాంట్రాక్టర్ తాత్కాలికంగా పైపులైన్ వేసి చేతులు దులుపుకొన్నాడని, దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని మంత్రికి వివరించారు. చింతల్‌చెరువుపై నాలుగు గ్రామాల ప్రజలు ఆధారపడి ఉన్న నేపథ్యంలో శాశ్వత వంతెన నిర్మించి, వరద నీరు చెరువులోకి వెళ్లేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన కిషన్‌రెడ్డి వెంటనే కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. ఈ లేఖ ప్రతిని ఎన్‌హెచ్– 65 ఏఈ శరత్‌చంద్రకు అందజేశారు. కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం నాయకులు మాచగోని రమేశ్‌ముదిరాజ్, ఎలమోని రామకృష్ణ, బీజేపీ నాయకులు బొడిగె గోవర్ధన్‌గౌడ్, వద్దేపల్లి పాపయ్యగౌడ్, శ్రీనివాస్, ఆనంద్, యాదగిరి, మల్లేశ్, మచ్చేందర్, శ్రీశైలం, రవి తదితరులు పాల్గొన్నారు.



ఏఈ శరత్‌చంద్రకు లేఖను అందజేస్తున్న నాయకులు

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు

గజ ఈతగాళ్లు గాలించినా దొరకని ఆనవాళ్లు



యూనిస్ (ఫైల్)

దోమ : చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి గల్లంతైన ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాకొండ గ్రామానికి చెందిన ఎండీ.యూనిస్(45) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అయితే అసెంబ్లీ ఎన్నికలకు ఇంటికి వచ్చి గ్రామంలో ఉంటూ వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోని చెరువు దగ్గరకి చేపల వేటకు వెళ్లాడు. ఒంటిపై ఉన్న దుస్తులను చెరువు ఒడ్డుపై పెట్టి చేపలను పట్టేందుకు చెరువులోకి దిగి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి చెరువు మొత్తం గాలించారు. అయిన అతని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మతిస్థిమితం కోల్పోయి దుస్తులు ఒడ్డున పెట్టి ఎక్కడైనా వెళ్లి ఉంటాడా? అని పోలీసులు అనుమానిస్తున్నారు. అతని అక్క కుమారుడు సమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించామని పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఘటన

ఇబ్రహీంపట్నం: వేగంగా వస్తున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెగూడకు చెందిన షణ్ముక సుందరం(25), డి. విక్కి(21) బైక్‌పై నగరం నుంచి బొంగుళూర్ వైపు వస్తున్నారు. ఓఆర్ఆర్ బొంగుళూర్ రింగ్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న సుందరం తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడగా, విక్కికీ స్వల్ప గాయాలు అయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు అధిక దిగుబడి సాధించాలి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

కొడంగల్ : రైతులు వరిధాన్యం సాగులో అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్ లో రైతు సదస్సుకు ముఖ్య అధితిగా ఆయన హాజరయ్యారు. వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మెలకువలు, సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. రైతులు ఎకరాకు వంద బస్తాల దిగుబడి వచ్చేలా కృషి చేయాలన్నారు. వరిపైరుకు అవసరమైన పోషకాలను అందిస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందన్నారు. రైతులు వారి ఇష్టం వచ్చినట్లు యూరియా డీఏపీ క్రిమిసంహారక మందులు వాడరాదన్నారు. వ్యవసాయాధికారులను సంప్రదించి తగిన మోతాదులో వాడాలన్నారు. అలాగే విత్తన దశ నుంచి కోతకు వచ్చే వరకు రైతులు పైరును కాపాడుకోవాలన్నారు. జిల్లాలో పెద్దగా సాగునీటి వనరులు లేవన్నారు. చెరువులు, కుంటలు, బోర్ల కింద రైతులు వరిసాగు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జియో లైఫ్ చైర్మన్ వినోద్ లాహోటీ, ఓం ట్రేడింగ్ కంపెనీ నిర్వాహకుడు ఆనంద్‌కుమార్ లాహోటీ, ఏడీఏ శంకర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

మురుగుమయం

బొంరాస్‌పేట: మారుమూల తండాల దారులు సైతం బీటీరోడ్లుగా మారాయి. కానీ, మండల కేంద్రంలోని ప్రధాన కూడలి నేటికీ మురుగుమయంగా కనిపిస్తోంది. భూలక్ష్మి ఆలయం వద్ద సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దుకాణాల నీరు రోడ్డుపైకి చేరి వాహనాల రాకపోకలతో మరింత బురదమయంగా మారి దుర్వాసనను వెదజల్లుతోంది. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు ఇలా అన్ని రకాల ప్రముఖులు తిరుగుతున్నా ముక్కుమూసుకుంటున్నారే తప్పా మురుగు సమస్యను పరిష్కరించడం లేదు. నూతన సంవత్సరంలోనైనా రోడ్డు సమస్యను పరిష్కరించాలని మండల కేంద్రం ప్రజలు, మండలవాసులు కోరుతున్నారు.



మండల కేంద్రం ప్రధాన కూడలిలో మురుగునీరు